క్లుప్తంగా

సబ్‌సెంటర్ తనిఖీ



తురకలాపట్నం సబ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

రొద్దం: మండలంలోని తురకలాపట్నం సబ్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సబ్ సెంటర్‌లో పని చేస్తున్న సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం రేపు

అమరాపురం: స్థానిక గ్రామ సచివాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు అమరాపురం చేపల చెరువు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

మండలానికి 224 నూతన పింఛన్లు

గోరంట్ల: మండలంలోని ఇరువై గ్రామ పంచాయతీలకు సంబంధించి 224 నూతన సామాజిక భద్రత పింఛన్లు మంజూరు అయినట్లు ఎంపీడీఓ రఘునాథగుప్త తెలిపారు. నూతనంగా పింఛన్లు మంజూరయిన లబ్ధిదారులకు సెప్టెంబర్ ఒకటోతేదీ నుంచి లబ్ధిదారులతో పాటు పింఛన్ మొత్తం వలంటీర్లు పంపిణీ చేస్తారన్నారు. గోరంట్ల మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో 11,126 పింఛన్లు ఉండేవని, నూతనంగా 224 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. గోరంట్ల మండలంలో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ కోసం ప్రతినెలా రూ. 13,13,07, 250 ప్రభుత్వం వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రాఖీ వేడుకలు



ఎమ్మెల్యే శంకరనారాయణకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సిస్టర్ హేమలత

పెనుకొండ: పట్టణంలో గురువారం రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరీయ మాతాజీ హేమలత సిస్టర్ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను తన స్వగృహంలో కలసి రాఖీ కట్టారు. పలువురు సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, ఆశీర్వాదం తీసుకున్నారు.


రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



రన్నర్స్ ట్రోఫీ అందుకున్న జిల్లా జట్టు

హిందూపురం టౌన్: విజయవాడలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అనంతపురం, సత్యసాయి జిల్లా జట్టు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 1–0 తేడాతో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. సత్యసాయి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోచ్ చైతన్యను గురువారం ఫుట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ అనిల్‌కుమార్ అభినందించారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

రొద్దం: మానవ హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. గురువారం దొడగట్ట ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ హక్కులు ఎలా ఉపయోగించుకోవాలి, దళిత భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులను కలిసి ఎలా పరిష్కరించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, పోలీస్ శాఖ, పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని మోదా ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పౌరహక్కులు, విధులు, చట్టాలు భారతీయ పౌరులందరికీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో మండల సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, గ్రామస్తులు డీలర్ మోహన్, మంజు పాల్గొన్నారు.

గోరంట్ల: ఎస్సీ, ఎస్టీల చట్టాలను ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. కసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు.సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ బాబు, వీఆర్‌ఓ అనిల్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పథకాలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక



పథకాల కరపత్రాలను అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: ప్రజలకు సంక్షేమ పథకాలు పింఛన్లు, రేషన్‌కార్డులు ఇలా అన్నింటినీ ఇంటి ముంగిటకే అందిస్తున్న వైఎస్సార్‌సీపీని ఆదరించాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక కోరారు. గురువారం మండలంలోని మణేసముద్రం గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, నాయకులు గిరి, దిలీప్‌తో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సమన్వయకర్త దీపికకు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆమె గడప గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పేద కుటుంబాలను ఆదుకుంటున్న తీరును వివరించారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. ఆయా కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం చేకూర్చిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే చెప్పాలని.. తాము సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ నరేంద్ర, తహసీల్దార్ హసీనా బాను, ఈఓఆర్డీ నటరాజ్, సచివాలయ సిబ్బందికి సూచించారు.

పేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం..

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుతోందని సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందినట్లు తెలిపారు. పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. 2024లో ఎన్నికల్లో టీడీపీకి గుడ్‌బాయ్ చెప్పాలన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ ముగ్గురు కలసి ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరన్నారు. కార్యక్రమంలో మండల అధికారులతో పాటు వైస్ ఎంపీపీ రామాంజి, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, లలిత, అశ్వర్థరెడ్డి, దేవరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు బసిరెడ్డి, సుబ్బిరెడ్డి, రాము, సుధాకర్ రెడ్డి, ఓబుళరెడ్డి, అంజన్‌రెడ్డి, రామ చంద్రారెడ్డి, చలపతి, బాబుల్లి, రమణారెడ్డి, రామాంజి, తిమ్మయ్య, వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, కన్వీనర్లు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలోని దొడ్డికుంట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పెనుకొండకు చెందిన బాషా అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై మరో ఇద్దరు కార్మికులను ఎక్కించుకొని సోమందేపల్లి వైపు వెళ్తుండగా, బైకు అదుపుతప్పి రబ్బరుదొడ్డికుంట వద్ద డివైడర్‌ను ఢీకొనింది. దీంతో బాషాతోపాటు ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలపై సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం ఆమె అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే గదిలో నిర్వహిస్తున్నప్పటికీ తనిఖీ చేసే సమయంలో పిల్లలు లేకపోవడంతో కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. పిల్లలపై నిర్లక్ష్యం వహించడం, మెనూ పాటించక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

మడకశిరరూరల్: స్థానిక కోర్టు హాల్‌లో సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే చూడాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్ అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు హాల్‌లో జడ్జి గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించి రాజీకి అవకాశం ఉన్న కేసులకు పరిష్కార మార్గం చూపాలన్నారు. పెండింగ్ కేసులున్నవారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొండపైకి పైప్‌లైన్ వేయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ప్రతాపరెడ్డి

పెనుకొండ: పెనుకొండ పైకి పైప్ లైను వేయించి, పర్యాటకుల దాహార్తి తీర్చాలని పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను కోరారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఇటీవల కొండ రోడ్డును ప్రభుత్వం నిర్మించిందని, పైపులైన్ వేయించి, విద్యుత్ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

4న ఉప సర్పంచ్ ఎన్నికలు

సోమందేపల్లి: మండలంలో ఈనెల 4న మూడు గ్రామ పంచాయతీలకు సంబంధించి ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఓ నాగరాజరావు తెలిపారు. మండ్లి, బ్రహ్మసముద్రం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఎన్నిక ఉంటుందన్నారు. ఆయా పంచాయతీలకు ఎన్నికల అధికారులను నియమించినట్లు తెలిపారు.

రేపు వాహనాల వేలం

హిందూపురం అర్బన్: పట్టణంలోని సెబ్ కార్యాలయం వద్ద ఈనెల 2వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ సమక్షంలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ జిరాక్స్ కార్డుతో వచ్చి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సొసైటీ బియ్యం వేలం

పావగడ: స్థానిక సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గత మార్చి 26న ఎన్నికల కోడ్ ఉల్లంఘన నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న 116 క్వింటాళ్ల సొసైటీ బియ్యాన్ని సెప్టంబర్ 7న బహిరంగ వేలం వేస్తామని పౌర సరఫరా శాఖ అధికారి కృష్ణమూర్తి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక శిరా రోడ్డులోని కేఎఫ్‌సీసీ గోడౌన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు స్థానిక పౌర సరఫరా శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

65 శాతం ఉత్తీర్ణత

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కేశవరావు గురువారం తెలిపారు. డిగ్రీ ప్రథమ, ఐదో సెమిస్టర్ ఫలితాల్లో 65 శాతం మేర ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఎనిమిది సబ్జెక్టులలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. జర్నలిజం కోర్సులో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మూఢ నమ్మకాలకు స్వస్తి పలకండి

పావగడ: మూఢ నమ్మకాలకు స్వస్తి పలికి ఆధునిక భావాలతో జీవించాలని స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం.ఎస్.హరిణి సూచించారు. తాలూకా లోని కారనాగనహట్టి గ్రామంలో గురువారం నిర్వహించిన మూఢ నమ్మకాల నివారణపై అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడుతూ పాత సంప్రదాయాలు, కట్టుబాట్ల ఆచరణతో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. బాల్య వివాహాలు మానుకోవాలన్నారు. స్త్రీలను గౌరవంగా చూసుకోవాలన్నారు. బాలికల చదువుకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. న్యాయ సేవా సమితి నుంచి అందరికీ సమాన న్యాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ న్యాయమూర్తి విస్మిత మూర్తి, ప్రధాన సివిల్ న్యాయమూర్తి శ్రీకాంత్ రవీంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.శేషానందన్, టీహెచ్‌ఓ తిరుపతయ్య, ఏపీపీ మంజునాథ్, న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: పట్టణంలో ప్రధానమైన రహదారుల్లో రైల్వే రోడ్డు, డీఎల్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. కౌన్సిల్ 21 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టారు. ముందుగా అనారోగ్యం కారణంగా మృతి చెందిన ఇంజినీర్ ఈశ్వరయ్యకు నివాళులర్పించారు. పరిగి బస్టాండ్‌లో వ్యాపారులు ఇష్టానుసారంగా 25 దాకా షెడ్లు వేసుకుని ఆక్రమించుకున్నారు. షెడ్ల ఏర్పాటుకు అనుమతి ఎలా ఇచ్చారని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఏళ్ల తరబడి బస్టాండు పరిసరాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారందరినీ రోడ్డున పడేయడం ఎంతవరకు న్యాయమన్నారు. వారందర్నీ ఆదుకోవాలని కౌన్సిలర్ సతీష్ కోరారు. 8వ వార్డు కౌన్సిలర్ గిరి మాట్లాడుతూ.. లేపాక్షి హైవే రోడ్డులోని శ్రీకంఠపురం వద్ద బ్రిడ్జి నిర్మాణం వల్ల తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయాయన్నారు. అయినా మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 11, 13, 15, 27, 28, 33 వార్డుల్లో తాగునీటి ఇబ్బందులున్నాయని ఆయా వార్డుల కౌన్సిలర్లు తెలిపారు. తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఆదేశించారు.

టీడీపీ కౌన్సిలర్ నిరసన..

మున్సిపాలిటీలోని తన వార్డు 36లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని నిరసిస్తూ టీడీపీ కౌన్సిలర్ భారతి నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. దీనిపై చైర్‌పర్సన్ ఇంద్రజ స్పందిస్తూ.. ముద్దిరెడ్డిపల్లి 36వ వార్డులో దాదాపు రూ.కోటి వరకు అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. రూ.57 లక్షలతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలవడం జరిగిందని అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

నిబంధనల మేరకే ఇసుక అనుమతులు



పరిగిలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: ప్రభుత్వ నిబంధనల మేరకే సంబంధిత అధికారులతో ఇసుక రవాణాకు అనుమతులు పొందాలని అధికారులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఏంపీపీ సవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అందరి అధికారుల, ప్రజాప్రతినిధుల సహకారంతోనే మండలం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ న్యూ శాండ్ పాలసీ ప్రకారం ఇసుకను పొందేందుకు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. మండలంలో జగనన్న భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా ఆరు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ దాదాపు పూర్తి కావొస్తోందన్నారు. అసైన్డ్ భూములపై పూర్తి స్థాయి హక్కులు పొందేందుకు ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీఓతో యజమానులకు ఎంతో ఉపశమనం కలిగిందన్నారు. హౌస్ టూ హౌస్ సర్వేతో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ పూర్తి చేయగలిగామని, పోలింగ్ బూత్‌లను ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అన్ని రకాల జబ్బులకు వైద్యాన్ని చేరువ చేస్తున్న ప్రభుత్వ లక్ష్యాన్ని మండలంలో విజయవంతంగా చేపడుతున్నట్లు మెడికల్ ఆఫీసర్లు నవీన, సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని 5 జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, బిల్లులు సకాలంలో లబ్ధిదారులకు అందుతున్నాయని హౌసింగ్ ఏఈ సునిత తెలిపారు. నాడు– నేడు పనులతో బడుల రూపురేఖలు మారిపోయాయని ఏంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. మొత్తం 13 పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ప్రసాద్‌రావు, వైస్ ఎంపీపీలు వేదవతి, శకుంతలమ్మ, మండల సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, కోఆప్షన్ మెంబర్ సలీం, ఏపీఎం దేవానంద్ ఫిలిప్సన్, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



జీవీపాళ్యంలో రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ

మడకశిరరూరల్: బోరు బావుల కింద ఉద్యాన పంటల సాగు లాభదాయకమని ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ సూచించారు. మండలంలోని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు గురువారం జీవీ పాళ్యం గ్రామంలో ఉద్యాన రైతు పొలాల్లో వైస్ చాన్సలర్ టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేసిన వివిధ ఉద్యాన పంటలను సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందని, నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో పీడీ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పూలు, పండ్ల మొక్కల పెంపకం అవగాహన

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో 2023 – 24లో పండ్లు, పూల తోటలు సాగు చేసిన రైతులకు మొక్కల సంరక్షణ ఏవిధంగా చేసుకోవాలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ మునిస్వామి, హార్టికల్చర్ అధికారి రంగనాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో మొత్తం 150 మంది రైతులకు మామిడి, పూల మొక్కలను అందించామన్నారు. నీరు, రక్షణ, కూలీ తదితర వాటిని ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం అందజేస్తుందన్నారు.కార్యక్రమంలో ఏపీఓ గోపాల్, రైతులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారి తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్

పెనుకొండ: మున్సిపల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ అప్రూవల్ అధికారి తీరు మార్చుకోవాలని కౌన్సిల్ సభ్యులు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కౌన్సిలర్ షహనాబీ టీపీఓపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టౌన్ అప్రూవల్ విషయంలో సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని, సమస్యలపై వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ సైతం టీపీఓ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కౌన్సిల్ సమావేశం రసాభాసాగా మారింది. సభ్యులందరూ టీపీఓ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజాయతీగా, పారదర్శకంగా పని చేసే టీపీవోను నియమించాలని సభ్యులు పట్టుబట్టారు. అనంతరం సమావేశంలో డీఎస్పీ బంగ్లా ఏరియాతో పాటు వెంకటరెడ్డిపల్లి పరిధిలో నీటి సరఫరా సక్రమంగా లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో షీఫారం నుంచి పట్టణంలోని వజ్రాలపేట, జీఏసీ కాలనీ, ఎన్‌టీఆర్ సర్కిల్ తదితర ప్రాంతాలకు రూ. 70 లక్షలకు పైగా నిధులు వెచ్చించి, తాగునీటి పైప్‌లైన్ వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.సమావేశంలో అధికారులు రవి, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, ఫర్జియాభాను, శేషాద్రి, గీత, తయూబ్, సంజీవమ్మ, గిరి, బోయ హారతి, భాస్కర్‌నాయక్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



హిందూపురం అర్బన్: వనజమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న దీపిక



లేపాక్షి: నారాయణప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని రాచపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి భార్య వనజమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వనజమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లేపాక్షి మండల కన్వీనర్ నారాయణ స్వామి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్లు శివ, షాజియా, వైస్ఎంపీపీలు రఘునాథరెడ్డి, అంజన్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, పార్టీ నాయకులు నాగభూషణంరెడ్డి, నాగార్జున రెడ్డి, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి తండ్రి నారాయణప్ప (75) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక, నాయకురాలు మధుమతిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పన్న, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజు, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, నాయకుడు బాబురెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నాడు–నేడు పనులపై సమీక్షించాలి

పెనుకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు –నేడు పనులపై సమీక్ష నిర్వహించాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు కోరారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ నాడు–నేడు పనుల్లో సరైన సమన్వయం లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. నాయకులు రవూఫ్, షమీవుల్లా, నరసింహులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పరిగి: మండల కేంద్రం పరిగిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఎం.ఆదెమ్మ (67) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పరిగి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. ఆగస్టు 15న స్థానిక బీరప్ప ఆలయ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆదెమ్మ తీవ్రంగా గాయపడింది. అదే రోజు ఆమెను చికిత్స నిమిత్తం హిందూపురానికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు బంధువులు తరలించారు. గత బుధవారం బెంగళూరులోనే ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెచ్‌సీ శ్రీనివాసులు తెలిపారు.

'హంద్రీ–నీవా'పై చర్చావేదిక రేపు

మడకశిర: నియోజకవర్గంలోని హంద్రీ–నీవా ప్రాజెక్ట్‌పై శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో చర్చావేదికను ఏర్పాటు చేసినట్లు జలసాధన సమితి ప్రతినిధి సోమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేధావులు, విద్యా వంతులు, ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, అన్ని వర్గాల నాయకులు హాజరై చర్చావేదికను విజయవంతం చేయాలని కోరారు.

అర్థమయ్యేలా బోధించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు సులభ పద్ధతిలో బోధించాలని ఎంఈఓ–2 శ్రీధర్ సూచించారు. గురువారం మండలంలోని రొళ్ల, హొట్టేబెట్ట కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు హొట్టేబెట్ట జెడ్పీహెచ్‌ఎస్‌లో, హెచ్‌టీ హళ్లి, బీజీ హళ్లి సంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు బీజీ హళ్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో, అలుపనపల్లి, రత్నగిరి కంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు రత్నగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించారు. అలాగే రొళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో వివిధ కాంప్లెక్స్‌లో జీవశాస్త్రం ఉపాధ్యాయులకు, హెచ్‌టీ హళ్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోషియల్ ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

రొద్దం: మండల వ్యాప్తంగా పెన్నానది, వాగుల నుంచి ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి సెబ్, రెవెన్యూ, పోలీసులు స్పందించారు. ఆర్.కుర్లపల్లి గ్రామ సమీపాన ఇసుక డంప్ ఉన్న చోట పర్యటించారు. ఇసుక డంప్‌పై ఆరా తీస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా గురు పీఠాధిపత్యం

పెనుకొండ: పట్టణంలోని గోనిపేట రోడ్డులో ఉన్న షేక్ సయ్యద్‌షా మహ్మద్ ఖ్రముద్దీన్ అలీ దత్త పుత్రుడైన సూఫీ షేక్ ఆదిల్ ఖాద్రి ఉర్ఫ్ సూఫీ మేతర్ ఖాద్రీ గురు పీఠాధిపత్యం గురువారం ఘనంగా జరిగింది. బీజాపూర్‌కు చెందిన యాసిన్ పీరా చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం మహ్మద్ ఖ్రముద్దీన్ ఆలీ ట్రస్ట్ నిర్వాహకులు ఆదిల్ ఖాద్రీని ఘనంగా సన్మానించారు.

ట్రస్టు పేరిట ప్రభుత్వ భూమి ఆక్రమణ

రొద్దం: మండలంలోని కోగిర గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిని స్వచ్ఛంద సంస్థ పేరుతో ఆక్రమించారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు గంగాధర్ అన్నారు. స్వచ్ఛంద సంస్థ పేరుతో ఆక్రమించుకున్న ప్రభుత్వం భూమిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం రైతులు జెండాలు పాతి, విత్తనాలు నాటారు. సర్వే నంబర్ 666, 669లో నాలుగు వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అయితే టింబక్టు–కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆక్రమించుకుని పేదల కడుపు కొడుతోందన్నారు. అడవిలో ఉన్న సంపదను అక్రమంగా విక్రయిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ భూమిని రైతులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి

అమరాపురం: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ రమేష్‌బాబు, డివిజన్ ఎన్నికల అధికారి రామచంద్రప్ప సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్‌ఓలతో వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి ఓటరు జాబితాలో పేర్లను సక్రమంగా చూడాలన్నారు. మరణించిన, గ్రామం వదలి వెళ్లిన వారిని జాబితా నుంచి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు తొలగించాలన్నారు. అలాగే కంప్యూటర్‌లో సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని వీఆర్వోలకు సూచించారు.

పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించండి

పావగడ: తాలూకా వ్యాప్తంగా నెలకొన్న తీవ్ర వర్షాభావం కారణంగా వర్షాధారిత వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయిందని, అలాగే ఇతర పంటలు కూడా నష్ట పోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు జి నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆందోళన చెందారు. ఈ కారణంగా పావగడను కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఎమ్మెల్యే హెచ్.వి. వెంకటేశ్ ను ఆయన కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.పరమేశ్వర్ చొరవ చూపి వెంటనే సంబంధిత అధికారులను పంటల పరిశీలనకు పంపించాలన్నారు. వారు అందించే నివేదిక ప్రకారం బాధిత రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.